సాక్షి
గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)
శనివారం | 22 | జూలై | 2023

గుడిసెల్లోకి చెరువొచ్చింది!




బతుకు బరువై కాయాకష్టం చేసేవాళ్లంతా.. గూడు కరువై గుడిసెలేసుకున్నారు. నిలువ నీడ లేక ఊరి చివరన ఉద్యమం చేస్తున్నారు. ప్రభుత్వం కనికరించి కాళ్లు చాపి నిద్రపోయేంత జాగా ఇస్తే చాలని ఆపసోపాలు పడుతున్నారు. రెండ్రోజులుగా కురిసిన వర్షానికి దర్గా కాజీపేట సమీపంలోని న్యూశాయంపేట చెరువులో వేసుకున్న గుడిసెల్లోకి నీరు చేరింది. మోకాళ్ల లోతు నీళ్లు, బురద, కప్పలు, పాముల మధ్య పిల్లాపాపలతో బిక్కుబిక్కుమంటూ గుడిసెవాసులు కాలం వెళ్లదీస్తున్నారు. శుక్రవారం గుడిసెల్లోకి చేరిన పేదల కన్నీటిని 'సాక్షి' క్లిక్‌మనిపించింది.

- సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, హన్మకొండ

న్యూస్‌రీల్

శిథిలావస్థలో ఉన్న ఇంటికి నోటీసులు



హసన్‌పర్తి: 'శిథిల భవనం తస్మాత్ జాగ్రత్త' శీర్షికన శుక్రవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి కార్పొరేషన్ అధికారులు స్పందించారు. రెండో డివిజన్ వంగపహాడ్‌లో శిథిల దశకు చేరుకున్న ఇంటిని కూల్చివేయాలని నోటీసులు అంటించారు.

'నవోదయ'లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

విద్యారణ్యపురి: జవహర్ నవోదయ విద్యాలయంలో 2024-25 విద్యాసంవత్సరంలో ఆరోతరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోవాలని హనుమకొండ డీఈఓ ఎండీ అబ్దుల్‌హై శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలో ప్రస్తుత విద్యాసంవత్సరంలో 5వతరగతి చదువుతున్న విద్యార్థులు ప్రవేశ పరీక్షలు రాసేందుకు అర్హులుగా పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు వరంగల్ జిల్లా మామునూరులోని నవోదయ విద్యాలయంలో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని డీఈఓ సూచించారు. ఆగస్టు 10వరకు దరఖాస్తులు చేసుకునేందుకు అవకాశం ఉందని, డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.నవోదయ.గౌట్.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తులు చేసుకోవాలని డీఈఓ కోరారు.

పీఆర్సీ వేయాలని బైక్ ర్యాలీ



విద్యారణ్యపురి/కాజీపేట రూరల్: పీఆర్సీ వేయాలని, సీపీఎస్ రద్దు చేయాలని, బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్ ప్రకటించాలనే డిమాండ్‌తో ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్పీసీ) ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. హనుమకొండ పబ్లిక్ గార్డెన్ నుంచి కాజీపేట రైల్వే జంక్షన్ వరకు బైక్ ర్యాలీ కొనసాగింది. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ నాయకులు ఎం.సదాశివరెడ్డి, రావుల రమేశ్, అటుకుల శ్రీనివాస్‌రెడ్డి, పెండెం రాజు, గుడిశాల సత్యనారాయణ, కట్కూరి శ్రీనివాస్, సుదర్శనం, గుడిశాల రమేశ్, సీహెచ్.లింగారావు, అజ్మీరా రాజారాం, సంజీవరెడ్డి, డి.రమేశ్, మల్లిక్, కుమారస్వామి, కె.సదానందం, అక్రమ్, కె.మోజెస్, ఎం.రాజ్‌కుమార్, సమ్మిరెడ్డి, ఎ.శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేడు కాజీపేట జంక్షన్‌కు డీఆర్‌ఎం రాక

కాజీపేట రూరల్: కాజీపేట జంక్షన్‌కు శనివారం దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ డివిజన్ రైల్వే మేనేజర్ (డీఆర్‌ఎం) భారతీశ్ కుమార్ జైన్ రానున్నట్లు శుక్రవారం స్థానిక రైల్వే అధికారులు తెలిపారు. ఇప్పటి వరకు సికింద్రాబాద్ డీఆర్‌ఎంగా పని చేసిన ఏకే.గుప్తా బదిలీ కాగా.. ఆయన స్థానంలో ఇటీవల డీఆర్‌ఎంగా భారతీశ్ కుమార్ జైన్ ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. తొలిసారిగా కాజీపేట జంక్షన్‌లో ఆయన పర్యటించి తనిఖీ చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ మేరకు డీఆర్‌ఎం ప్రత్యేక రైలులో ఉదయం సికింద్రాబాద్ నుంచి బయల్దేరి కాజీపేట జంక్షన్‌కు చేరుకుంటారు. పలు విభాగాలను తనిఖీ చేస్తారు. డీఆర్‌ఎం తనిఖీ సమాచారంతో కాజీపేట జంక్షన్‌లోని అన్ని విభాగాల రైల్వే అధికారులు అప్రమత్తమయ్యారు.

ఎర్రబెల్లి స్వర్ణను కలిసిన రిటైర్డ్ ఐపీఎస్ అధికారి నాగరాజు



హన్మకొండ: కాంగ్రెస్ పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణను రిటైర్డ్ ఐపీఎస్ అధికారి కె.ఆర్.నాగరాజు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా స్వర్ణ, వరద రాజేశ్వర్ రావు దంపతులను శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందించి సన్మానించారు. నాగరాజు త్వరలో కాంగ్రెస్ పార్టీలో చేరనుండడం.. వర్ధన్నపేట నియోజకవర్గంనుంచి ఎమ్మెల్యేగా బరిలో నిలుస్తున్నారన్న ప్రచారం మేరకు స్వర్ణ దంపతులను కలవడం ప్రాధాన్యత సంతరించుకుంది.

ఉద్యోగుల కుటుంబాల్లో వెలుగు



కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

హన్మకొండ అర్బన్: కారుణ్య నియామకాలతో ఉద్యోగ కుటుంబాల్లో వెలుగు నిండిందని టీఎన్జీఓస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని టీఎన్జీఓస్ భవన్‌లో ఏర్పాటు చేసిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కారుణ్య నియామకాలకు సంబంధించి రాష్ట్రవ్యాప్తంగా 1,266 దరఖాస్తులు పెండింగ్‌లో ఉండగా.. వారికి పోస్టింగ్‌లు ఇచ్చే అధికారాన్ని కలెక్టర్లకు అప్పగించినట్లు తెలిపారు. కారుణ్య నియామకాల సమస్య పరిష్కరించి, ఉద్యోగుల కుటుంబాల్లో వెలుగు నింపిన సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, హరీశ్ రావు, టీఎన్జీఓస్ కేంద్ర సంఘం అధ్యక్షుడు మామిళ్ల రాజేందర్, ప్రధాన కార్యదర్శి మారం జగదీశ్వర్‌కు హనుమకొండ యూనియన్ పక్షాన కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం కలెక్టర్ సిక్తా పట్నాయక్‌ను కలిసి త్వరగా కారుణ్య నియామకాల భర్తీ ప్రక్రియను పూర్తి చేయాలని విన్నవించారు.

ఇంత వానకే అంత మునకా!

చినుకు పడితే చాలు.. రహదారులపైకి నీరు..

- మూడు రోజుల వర్షానికే ముప్పుతిప్పలు.. ముందు ముందు ముంపు తప్పదు..
- ఇప్పటికైనా మేల్కొంటే మేలు.. 'గ్రేటర్'పై ప్రణాళిక అవసరం..
- ఇటీవలి వర్షం, వరదలపై సీఎస్ కాన్ఫరెన్స్...
- కలెక్టర్లు, కమిషనర్‌లతో పరిస్థితిపై సీఎస్ ఆరా..
- ముందస్తు చర్యలకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు..



గురువారం కురిసిన వర్షానికి హనుమకొండ కాకాజీ కాలనీలో రోడ్డుపై ప్రవహిస్తున్న వరద

నగరంలో డివిజన్లు	66
విస్తీర్ణం	407 చదరపు కిలో మీటర్లు
డ్రెయినేజీ వ్యవస్థ	1433.02 చ.కి.మీ
ప్రధాన నాలాల విస్తీర్ణం	54.58 చ.కి.మీ
ఒక మీటరు మురుగు కాల్వలు	151.06 చ.కి.మీ
పక్కా డ్రెయినేజీలు	882.21 చ.కి.మీ
నగర జనాభా	సుమారు 11 లక్షలు..

సాక్షిప్రతినిధి, వరంగల్: గ్రేటర్ వరంగల్ మహానగరంలో చిన్నపాటి వర్షానికే పొంగిపొర్లిన మురుగుకు వరద నీరు తోడై రోడ్లన్నీ జలమయమయ్యాయి. మూడు రోజులపాటు కురిసిన వర్షాలకు 22 డివిజన్లలోని లోతట్టు ప్రాంతాల్లో వరద చేరి చెరువులను తలపించే విధంగా మారిపోయాయి. సుమారు 41 కాలనీల్లోని ఇళ్ల ముంగిళ్లలోకి నీరు రావడంతో రాత్రుళ్లు కునుకు లేకుండా పోయింది. వరద, మురుగునీటి నాలాలంటూ ఏటా రూ.కోట్లు వెచ్చిస్తున్నా.. పరిష్కారం లభించడం లేదు. పూడిక తీత, మరమ్మతులు, నిర్మాణాలకు నిధులు ఖర్చు చేస్తున్నా.. చినుకు పడితే చాలు నగరం జలమయం అవుతోంది. నగరవాసులు నానాయాతనకు గురవుతున్నారు.

మేల్కొకపోతే 2020 ఘటనలు పునరావృతం..

2020 ఆగస్టులో వచ్చిన వరదలతో వరంగల్ నగరం నీట మునిగింది. జనజీవనం అతలాకుతలం కావడంతో మంత్రి కేటీఆర్ స్వయంగా పరిశీలించారు. గతంలో ఏర్పాటు చేసిన నాలాలు ప్రస్తుత అవసరాలకు సరిపడా లేవని, వరద ప్రవాహాన్ని అంచనా వేసి అందుకు తగ్గట్టుగా ప్రతిపాదనలు రెడీ చేయాలని అధికారులను ఆదేశించారు. బొందివాగు నాలా సమస్య తీవ్రంగా ఉండడంతో ఇరిగేషన్ ఆఫీసర్లు రిటైనింగ్ వాల్, రెండు చోట్ల గేట్లు, మరికొన్ని పనులకు రూ.158 కోట్లు ప్రతిపాదించారు. రూ.25 కోట్లు తక్షణమే విడుదలకు కేటీఆర్ అధికారులను ఆదేశించారు. సమ్మయ్యనగర్ సమీపంలో 'డక్ట్' నిర్మాణం కోసం మంజూరు చేసిన రూ.54 కోట్ల అంచనాతో మొదలై సుమారు రూ.75 కోట్లకు చేరినా పనులు పూర్తి కాలేదు. నయింనగర్ నాలా పొడవునా నిర్మించాల్సిన రిటైనింగ్ వాల్స్ ప్రెసిడెన్సీ స్కూల్ వద్దే ఆగాయి. హనుమకొండలో వడ్డేపల్లి చెరువు క్యాచ్‌మెంట్ పరిధిలో వరదలు ముంచెత్తడంతో గత ఏడాది ఫిబ్రవరిలో స్మార్ట్ సిటీ ఫండ్స్‌తో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పనులు స్టార్ట్ చేసి ఏడాది దాటినా పూర్తి కాలేదు.

తడిసి ముద్దయిన కాలనీలు..

వరంగల్, హనుమకొండ, కాజీపేట ట్రై సిటీస్‌లోని పలు కాలనీలు నీట మునిగాయి. శుక్రవారం పొద్దంతా విరామంతో కొంతమేరకు తేరుకున్నా.. అధికారుల అంచనా ప్రకారం సుమారు 41 కాలనీలకు నీరు చేరింది. హనుమకొండలోని రాజీవ్‌నగర్, సమ్మయ్యనగర్, వాజ్‌పేయికాలనీ, విద్యానగర్, పోచమ్మకుంట, ఇంద్రానగర్, దీన్‌దయాళ్‌నగర్, కాజీపేట ప్రశాంత్‌నగర్, బ్యాంక్ కాలనీ తదితర ప్రాంతాలకు వరద నీరు తాకింది. హనుమకొండ బస్‌స్టేషన్ రోడ్డు, బాలసముద్రం, జీఎస్‌ఎస్ రోడ్లపై శుక్రవారం ఉదయం వరకు వరద పారింది. వరంగల్ రైల్వేగేట్, శివనగర్, మైసయ్యనగర్, శాకరాశికుంట, కాశికుంట, నాగేంద్రనగర్ కాలనీ, గాంధీనగర్, డీకే నగర్, ఎస్‌ఆర్ నగర్, సాయిగణేష్ కాలనీ, గాంధీనగర్, లక్ష్మీగణపతి కాలనీ, మధురానగర్, వీవర్స్ కాలనీ, శాంతి నగర్, సుజిత్ నగర్, ఎల్‌బీనగర్, చాకలి ఐలమ్మ నగర్, ఎన్‌టీఆర్ నగర్.. తదితర కాలనీలకు వరద తాకింది. ఎస్‌ఆర్ నగర్, వివేకానందనగర్, సాయిగణేష్ కాలనీ, లక్ష్మీగణపతి కాలనీ, మధురానగర్, గిరిప్రసాద్‌నగర్, గాంధీనగర్, మైసయ్యనగర్, భద్రకాళినగర్‌లలో వర్షం పడినంత సేపు వరద పారింది.

ఖిలా వరంగల్‌లోని విద్యానగర్‌కాలనీలోకి చేరిన వరద



వరదలపై సీఎస్ ఆరా...

మూడు రోజులు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాల నేపథ్యంలో గ్రేటర్ వరంగల్‌లో పరిస్థితిపై ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి శాంతికుమారి ఆరా తీశారు. వర్షాల నేపథ్యంలో అన్ని జిల్లాల కలెక్టర్లతో ప్రతి రోజూ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన సీఎస్.. గ్రేటర్ వరంగల్‌లో వర్షాల వల్ల క్షేత్రస్థాయి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. హనుమకొండ, వరంగల్ జిల్లా కలెక్టర్లు సిక్తా పట్నాయక్, ప్రావీణ్య, మున్సిపల్ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా పరిస్థితిని సీఎస్‌కు వివరించారు. శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు వర్షం విరామం ఇచ్చినా.. వచ్చే 48 గంటల్లో భారీ వర్షసూచన ఉందన్న వాతావరణశాఖ హెచ్చరికలతో అధికారులు, సిబ్బందిని అప్రమత్తం చేశారు. 24/7 సిబ్బంది అందుబాటులో ఉండాలని, నీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్న ఆక్రమణలను వెంటనే తొలగించాలని ఆదేశించిన కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్.. ముందస్తు చర్యల కోసం ప్రభుత్వానికి తాజాగా ప్రతిపాదనలు పంపినట్లు తెలిసింది.

స్కానింగ్ సెంటర్లపై నిఘా పెంచాలి

కలెక్టర్ సిక్తా పట్నాయక్

హన్మకొండ అర్బన్: జిల్లాలోని అల్ట్రాసౌండ్ స్కానింగ్ సెంటర్లపై నిఘా పెంచి, దంపతులు ఆడ, మగ బిడ్డలను సమానంగా ఆదరించేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అధికారులను ఆదేశించారు. లింగ నిర్ధారణ పరీక్షల నియంత్రణ చట్టం అమలులో భాగంగా శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా అప్రాప్రియేట్ అథారిటీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లాలో చట్టం అమలు తీరు, చేపట్టిన అవగాహన కార్యక్రమాలు, పీహెచ్‌సీల వారీగా ఆడపిల్లల జననాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ సిక్తాపట్నాయక్ మాట్లాడుతూ.. జిల్లాలో అమ్మాయిల జననాలు తక్కువగా నమోదవుతున్న ప్రాంతాల్లో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలన్నారు. అక్రమంగా అబార్షన్లు నిర్వహిస్తున్న ఆస్పత్రులు, స్కానింగ్ సెంటర్లపై నిఘా, పర్యవేక్షణ పెంచాల్సిన బాధ్యతను ఎన్జీఓలు తీసుకోవాలని సూచించారు. పోలీస్ డిపార్ట్‌మెంట్ సహకారంతో గ్రామాల్లో కళాజాత బృందాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. మహిళా సమాఖ్య సభ్యుల సమావేశంలో పీసీపీఎన్‌డీటీ చట్టంపై అవగాహన కల్పించాలన్నారు. జిల్లా సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసులు మాట్లాడుతూ.. మహిళా కళాశాలల్లో విద్యార్థులకు అన్ని ఆరోగ్య అంశాలతో పాటు చట్టంపై అవగాహన కల్పించాలని, మహిళలకు ప్రభుత్వం కల్పిస్తున్న పథకాలను వివరించాలని తెలిపారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ సాంబశివరావు, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ ఎండీ యాకూబ్‌పాషా, జిల్లా సంక్షేమాధికారి మధురిమ, మారి ఎన్జీఓ ఆర్.కృష్ణమూర్తి, జిల్లా మాస్ మీడియా అధికారి వి.అశోక్‌రెడ్డి, డిప్యూటీ డెమో కె.ప్రసాద్, ఎస్సై ఫసీఉద్దీన్, డీసీపీఓ సంతోష్ కుమార్, డి.కళ్యాణి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు, ముంపు ప్రాంతాల పరిశీలన

హన్మకొండ: వర్షాలు, వరదలతో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టినట్లు హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్ తెలిపారు. శుక్రవారం గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా, అధికారులతో కలిసి హనుమకొండ పరిధి వడ్డేపల్లి చెరువు వరద నీటి ఔట్ ఫ్లో ఏరియాలోని సమ్మయ్యనగర్, ఇంజనీర్స్ కాలనీ వద్ద 100 అడుగుల రోడ్డు, 80 ఫీట్ల రోడ్డులో కొత్తగా నిర్మించిన డక్ట్ అండ్ డ్రైన్‌ను, నాలాను కలెక్టర్ పరిశీలించారు. నయింనగర్ పెద్ద మోరీ, రాజాజీనగర్ వద్ద నాలాను, కొత్తూరు సమీపంలోని బ్రిడ్జి నాలాను పరిశీలించి వరద ప్రవాహాన్ని పరిశీలించారు. అనంతరం కాకాజీ కాలనీలోని పర్యటించారు. ఈసందర్భంగా కలెక్టర్ సిక్తా పట్నాయక్ మాట్లాడుతూ.. భారీ వర్షాల నేపథ్యంలో వరంగల్, హనుమకొండ జిల్లాలను రెడ్ అలర్ట్‌గా ప్రకటించినట్లు తెలిపారు. ప్రస్తుతం ఆరెంజ్ అలర్ట్‌లోకి చేరుకుందన్నారు. నగరం ముంపునకు గురికాకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ రవీందర్ యాదవ్, సీఎంహెచ్‌ఓ డాక్టర్ రాజేశ్, సిటీ ప్లానర్ వెంకన్న, బయాలాజిస్ట్ మాధవరెడ్డి, డీఎఫ్‌ఓ శంకర్ లింగం, డీసీపీ ప్రకాశ్‌రెడ్డి, ఈఈ రాజయ్య, సంజయ్‌కుమార్, డీఈలు రవికుమార్, సంతోశ్‌తో పాటు ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



కాళోజీ కళాక్షేత్రంపై జరిగిన సమీక్షలో పాల్గొన్న సుందర్‌రాజ్, కలెక్టర్లు సిక్తా పట్నాయక్, ప్రావీణ్య

సీఎం ఆలోచనలకు ప్రతిరూపం కళాక్షేత్రం

హన్మకొండ అర్బన్: సీఎం ఆలోచనలకు ప్రతిరూపమే కాళోజీ కళాక్షేత్రం అని 'కుడా' చైర్మన్ సుందర్ రాజ్ యాదవ్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో కళాక్షేత్రం నిర్మాణ పనులపై కుడా చైర్మన్, హనుమకొండ, వరంగల్ కలెక్టర్లు సిక్తాపట్నాయక్, ప్రావీణ్య సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా సుందర్ రాజ్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశాల మేరకు కళాక్షేత్రం సత్వరమే పూర్తి చేసి అందుబాటులోకి తేవాలన్నారు. కాళోజీ రచనలు, చరిత్ర, పరిశోధనలు వంటివి సంపూర్ణంగా గ్యాలరీలో ఉంచాలన్నారు. సమావేశంలో 'కుడా' అజిత్‌రెడ్డి, కాళోజీ ఫౌండేషన్ చైర్మన్ రామశాస్త్రి, ప్రధాన కార్యదర్శి విద్యార్థి, శ్రీనివాస్‌రావు, అశోక్ ఉన్నారు.

పనులు గడువులోగా పూర్తి చేయండి

- బల్దియా కమిషనర్ రిజ్వాన్‌బాషా
- స్మార్ట్ సిటీ పనుల పురోగతిపై సమీక్ష



సమీక్షలో మాట్లాడుతున్న కమిషనర్ రిజ్వాన్‌బాషా

వరంగల్ అర్బన్: గ్రేటర్‌లో చేపట్టిన స్మార్ట్‌సిటీ పనులు గడువులోగా పూర్తి చేయాలని బల్దియా కమిషనర్ రిజ్వాన్‌బాషా అన్నారు. బల్దియా కార్యాలయంలో శుక్రవారం స్మార్ట్‌సిటీ పనులపై కాంట్రాక్టర్లు, అధికారులతో సమీక్ష నిర్వహించారు. భద్రకాళి బండ్, బయోమైనింగ్, లాండ్రోమార్ట్, స్మార్ట్‌రోడ్లు, ట్రాన్స్‌ఫర్‌స్టేషన్లు, కల్వర్టు నిర్మాణ పనులు, డ్రెయినేజీ నిర్మాణ పనుల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. పనులు పూర్తి చేయడానికి వారం రోజుల వారీగా లక్ష్యాలను సూచించడం జరుగుతుందని, వాటిని చేరుకునేలా కాంట్రాక్టర్లు, పీఎంసీ అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సమావేశంలో ఎస్‌ఈ ప్రవీణ్‌చంద్ర, సీహెచ్‌ఓ శ్రీనివాసరావు, డీసీపీ ప్రకాశ్‌రెడ్డి, ఏసీపీలు శ్రీనివాస్‌రెడ్డి, ఖలీల్, ఈఈలు సంజయ్‌కుమార్, రాజయ్య, శ్రీనివాస్, డీఈలు రవికుమార్, సంతోశ్‌బాబు, సారంగంతోపాటు పీఎంసీ ఆనంద్ ఓలేటి తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రత్యేక గ్రీవెన్స్

కాళోజీ సెంటర్ : జిల్లాలోని దివ్యాంగులు, వయోవృద్ధులకు శనివారం కలెక్టరేట్‌లో ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహించనున్నట్లు జిల్లా సంక్షేమాధికారి ఎం.శారద ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 నుంచి 12 గంటల వరకు నిర్వహించే ప్రత్యేక గ్రీవెన్స్‌లో దరఖాస్తులు అందించాలని కోరారు.

ఆక్సిజన్ కుంభకోణంపై సీఐడీ చార్జ్‌షీట్

2013లోనే కుంభకోణాన్ని వెలుగులోకి తెచ్చిన 'సాక్షి'

- 2015లో కేసు నమోదు చేసిన సీఐడీ
- రూ. నాలుగు కోట్లు దుర్వినియోగం జరిగినట్లు నిర్ధారణ
- 15 మందిపై కేసు నమోదు







2013 సాక్షిలో ప్రచురితమైన కథనాలు

ఎంజీఎం : వరంగల్‌కు ధర్మాస్పత్రిగా పేరుగాంచిన ఎంజీఎం ఆస్పత్రిలో జరిగిన ఆక్సిజన్ కుంభకోణాన్ని 2013లో 'సాక్షి' దినపత్రిక వెలుగులోకి తేగా.. విషయ తీవ్రతను గమనించిన సీఐడీ అధికారులు 2015లో కేసు నమోదు చేశారు. నెలలు, ఏళ్ల తరబడిగా విచారణ చేసిన అధికారులు శుక్రవారం ఎట్టకేలకు కుంభకోణం జరిగిన విధానంపై చార్జ్‌షీట్ దాఖలు చేశారు. 2007 నుంచి 2013 వరకు జరిగిన ఆక్సిజన్ టెండర్ విధానంలో నాలుగు కోట్ల ప్రభుత్వ నిధులను దుర్వినియోగం చేసినట్లు పేర్కొన్నారు. బహిరంగ మార్కెట్‌లో రూ.180కు సరఫరా జరిగే ఆక్సిజన్ టెండర్‌ను రూ.385 కొనుగోలు చేసినట్లు నిర్ధారించారు. అలాగే ఈ కుంభకోణానికి సహకరించిన 13 మంది అడ్మినిస్ట్రేటివ్ అధికారులతోపాటు వరంగల్ తులసీ ఏజెన్సీ నిర్వాహకులను నిందితులుగా పేర్కొంటూ కేసు నమోదు చేశారు.

తీగ లాగితే డొంక కదిలింది..

ప్రభుత్వం విచారణకు ఆదేశించగానే 'సాక్షి'లో వచ్చిన కథనంపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టారు. 2007 నుంచి 2013 వరకు ఆస్పత్రిలో నామినేషన్ పద్ధతిన టెండర్ కేటాయించడంతోపాటు సరఫరా చేసిన సిలిండర్లకు సైతం అద్దె కట్టించుకున్నారు. ఈ విషయం సైతం 'సాక్షి' కథనంలో క్షుణ్ణంగా వచ్చింది. ఒక్కో సిలిండర్‌కు అదనంగా రూ.190తోపాటు, 2007 నుంచి 2013 వరకు ఎంజీఎం ఆస్పత్రి నుంచి రూ.35.29 లక్షల అద్దె చెల్లించినట్లు.. ఈ రకంగా ప్రతి సంవత్సరం లక్షల రూపాయల దోపిడీ జరిగినట్లు గుర్తించారు.

సంచలనంగా మారిన ఆక్సిజన్ దందా...

ఆక్సిజన్ కాంట్రాక్టర్ వద్ద నుంచి డబ్బులు తీసుకుంటూ ఏకంగా ఓ సూపరింటెండెంట్ స్థాయి వ్యక్తి ఏసీబీకి పట్టుబడడంతో రాష్ట్ర, జిల్లాస్థాయి అధికారులు ఎంజీఎం ఆస్పత్రి పాలనపై ప్రత్యేక దృష్టి సారించారు. అసలు ఆక్సిజన్ కాంట్రాక్టర్ లక్షల రూపాయలు సూపరింటెండెంట్‌కు లంచం ఇచ్చేందుకు ఎందుకు ఒప్పుకున్నారు. ఆక్సిజన్ సరఫరాలో ఏం జరుగుతుంది? అనే విషయాన్ని తెలుసుకునేందుకు ప్రభుత్వం విజిలెన్స్, సీఐడీ విచారణకు ఆదేశించింది.

కాంట్రాక్టర్‌తోపాటు 13 మంది అధికారులపై కేసు నమోదు..

ఆక్సిజన్ కుంభకోణంలో తులసీ ఏజెన్సీ నిర్వాహకులు నరహరి బిందురెడ్డి, నరహరి మనోహర్‌రెడ్డి, 2007 నుంచి 2013వ వరకు అడ్మినిస్ట్రేటివ్ విభాగంలో పని చేసిన 13 మంది అధికారులను నిందితులుగా చార్జ్‌షీట్‌లో పేర్కొన్నారు. ఆ కాలవ్యవధిలో పని చేసిన డాక్టర్ రఘురాం, అశోక్‌కుమార్, ఏ.ఎస్.ఆర్ లక్ష్మి, బలభద్ర పాత్రుని శ్యాంసుందర్‌రావు, తుంగతుర్తి సురేందర్, డాక్టర్ సత్యదేవ్, నరేంద్రకుమార్, బెంజిమెన్ సామెల్, కొండ్రు నాగేశ్వర్‌రావు, సుద్దాల లక్ష్మి రాజం, పిల్లి సాంబశివరావు, గంధన్ శేషాచారి నరసింహన్, వరికోటి విష్ణుమోహన్‌లను నిందితులుగా చార్జ్‌షీట్‌లో పేర్లు నమోదు చేశారు.

కుంభకోణం వెలుగుచూసింది ఇలా...

ప్రభుత్వ ఆస్పత్రుల్లో టెండర్‌ల విధానాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తున్న క్రమంలో వేలాది మంది పేద ప్రజలకు సేవలందిస్తున్న ఎంజీఎం ఆస్పత్రి వైద్యసేవల్లో ఆక్సిజన్ టెండర్ కీలకంగా మారింది. ఇందులో అక్రమాలు జరుగుతున్నట్లు 'సాక్షి' దృష్టికి వచ్చింది. ఈ క్రమంలో 2013 మే నెలలో ఆస్పత్రిలోని ప్రధాన వార్డులకు ఆక్సిజన్ ఎలా సరఫరా చేస్తున్నారు.. ఏ విధంగా కొనుగోలు చేస్తున్నారనే విషయాన్ని పరిశీలించిన ప్రతినిధులకు ఖంగుతినే విషయాలను గమనించాల్సి వచ్చింది. బహిరంగ మార్కెట్‌లో రూ.180కు లభించే ఆక్సిజన్ సిలిండర్‌ను ఏకంగా డబుల్ ధరకు రూ. 385కు చేస్తూ ప్రభుత్వ ఖజానాకు పెద్ద గండి కొడుతున్న విషయాన్ని గమనించి 2013 మే 17వ తేదీన ఆక్సిజన్ 'టెండర్' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. ఈ కథనంలో సిలిండర్‌లో ఎంత కెపాసిటీ గేజ్‌తో ఆక్సిజన్ నింపాలి.. ఎంత గేజ్‌తో నింపుతున్నారు అనే విషయం సమగ్రంగా వచ్చింది. ఈ కథనాన్ని ఆసరా చేసుకున్న అప్పటి సూపరింటెండెంట్ డాక్టర్ రామకృష్ణ.. కాంట్రాక్టర్ మనోహర్‌రెడ్డి వద్ద నుంచి డబ్బులు డిమాండ్ చేశారు. ఆతర్వాత కాంట్రాక్టర్ మనోహర్ రెడ్డి.. 2013 జూలై నెలలో డాక్టర్ రామకృష్ణకు లంచం ఇస్తుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు.


ప్రభుత్వ ఆదేశాలు పాటించాలి : కలెక్టర్



సీకేఎం కళాశాల గవర్నింగ్ సమావేశంలో మాట్లాడుతున్న వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య

కరీమాబాద్ : వరంగల్‌లోని సీకేఎం కళాశాలను ప్రభుత్వం ఆధీనంలోకి తీసుకున్న నేపథ్యంలో పరిపాలనా పరంగా ఎలాంటి నిర్ణయాలు తీసుకోవాలన్నా ప్రభుత్వ ఆదేశాలను పాటించాల్సిందేనని కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. కలెక్టర్ చాంబర్‌లో శుక్రవారం సీకేఎం ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల గవర్నింగ్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పాలకమండలి అధ్యక్షురాలు, కలెక్టర్ ప్రావీణ్య కళాశాలలో విద్యార్థుల సంఖ్య, తరగతి గదుల పరిస్థితి, కెమిస్ట్రీ, బయాలజీ ల్యాబ్‌ల సౌకర్యాల గురించి ప్రిన్సిపాల్‌ను అడిగి తెలుసుకున్నారు. కళాశాల అభివృద్ధి కోసం చేపట్టాల్సిన పనుల గురించి చర్చించారు. సమావేశంలో కళాశాల పాలక మండలి సభ్యుడు, ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్, ఉపాధ్యక్షుడు డాక్టర్ టి.సుధాకర్‌రెడ్డి, సెక్రటరీ, ప్రిన్సిపాల్ డాక్టర్ శశిధర్‌రావు, ట్రెజరర్ ఈరసాని వెంకటరెడ్డి, ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ బన్న ఐలయ్య, ఎస్‌ఎస్‌పీఎన్ శర్మ, కేడీసీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రాజారెడ్డి, చందా శ్రీకాంత్, డాక్టర్ వి.ధర్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం డాక్టర్ పి.సుధాకర్‌రెడ్డి, ప్రొఫెసర్ ఎస్ఎస్‌పీఎన్ శర్మను పాలకమండలి ఉపాధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.


వెంకటాపురం(కె) : ముత్యంధార జలపాతం





గూడూరు: భీమునిపాద జలపాతం

గంగారం : ఏడుబావుల లొద్ది జలపాతం



వాజేడు : బొగత జలపాతం



ఫొటో స్టోరీ

కనువిందు చేస్తున్న జలపాతాలు

భారీ వర్షాలతో వస్తున్న వరదలతో మహబూబాబాద్, ములుగు జిల్లాల్లోని జలపాతాలు పర్యాటకులను కనివిందు చేస్తున్నాయి. బయ్యారం మండలంలోని వంకమడుగువాగుపై ఉన్న చింతోనిజలపాతం, బయ్యారం గుట్టపై ఉన్న పాండవుల జలపాతం పై నుంచి లోతైన ప్రాంతంలో జాలువారుతున్న నీటి అందాలు పలువురిని ఆకట్టుకుంటున్నాయి. గూడూరు మండలం సీతానగరం శివారు కొమ్ములవంచ సమీప దట్టమైన అడవిలో ప్రకృతిసిద్ధంగా ఏర్పడిన భీమునిపాద జలపాతం పర్యాటక కేంద్రంగా పేరు గాంచింది. గంగారం మండలంలోని కొడిశలమిట్ట అటవీ ప్రాంతంలోని ఏడుబావుల లొద్ది పర్యాటకులను వర్షాకాలం ఆకర్షిస్తోంది. ఏడు బావుల లొద్ది నుంచి జలపాతం గలగలపారుతూ నేలను తాకుతుండడంతో... చుట్టూ పచ్చదనంతో అడవి... కోకిల రాగాలతో కనువిందు చేసేలా ఏడుబావుల లొద్ది పర్యాటకులను ఆకర్షిస్తోంది. ములుగు జిల్లా వాజేడు మండలంలోని బొగత జలపాతం, వెంకటాపురం మండలంలోని వీరభద్రవరం సమీపంలోని ముత్యంధార జలపాతం, మహితాపురం జలపాతాలు జలకళను సంతరించుకున్నాయి. జలపాతాల అందాలను చూసేందుకు మండల వాసులతో పాటు ఖమ్మం, ఇల్లందు, గార్ల, డోర్నకల్, కురవి, మహబూబాబాద్, గూడూరు, నర్సంపేట హైదరాబాద్ ప్రాంతాల నుంచి సందర్శకులు వస్తున్నారు.

– బయ్యారం/గూడూరు/గంగారం/వెంకటాపురం(కె)/వాజేడు

బయ్యారం : జాలువారుతున్న పాండవుల జలపాతం, వెంకటాపురం (కె): మహితాపురం జలపాతం







బయ్యారం: బొల్లిజలపాతం

పోక్సో కేసులో వ్యక్తికి ఐదేళ్ల జైలు

మరిపెడ: పోక్సో కేసులో నిందితుడిపై నేరం రుజువు కావడంతో ఐదేళ్ల జైలు శిక్ష, రూ.9వేల జరిమానా విధిస్తూ మహబూబాబాద్ జిల్లా కోర్టు సివిల్ జడ్జి చంద్రశేఖర ప్రసాద్ శుక్రవారం తీర్పునిచ్చారు. వివరాల్లోకి వెళ్తే.. మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలం పడమటిగూడెం శివారు బాల్యతండాకు చెందిన బాలిక మరిపెడలోని సోషల్ వెల్ఫేర్‌లో 5వ తరగతి చదువుతుంది. ఈ నేపథ్యంలో పడమటిగూడెం తండాకు చెందిన పవన్‌కుమార్ బాలికను వసతిగృహం నుంచి పేరెంట్ అని చెప్పి ఆగస్టు 22, 2022లో వెంట తీసుకెళ్లి మరిపెడ మండలం అబ్బాయిపాలెం శివారులో అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. ఈ క్రమంలో బాలిక తల్లిదండ్రులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా విచారణ చేపట్టిన మరిపెడ ఎస్సై పవన్‌కుమార్ నిందితుడిని అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు. శుక్రవారం తొర్రూర్ సివిల్ కోర్టులో నిందితుడికి ఐదేళ్ల జైలు శిక్ష, రూ. 9 వేలు జరిమానా విధించినట్లు పీపీ పద్మాకర్‌రెడ్డి చెప్పారు.

నేడు విద్యాసంస్థలకు సెలవు

విద్యారణ్యపురి: రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో శుక్రవారం రాత్రి ప్రభుత్వం విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించింది. దీంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలో కూడా విద్యాసంస్థలకు సెలవు ఉంటుంది. ఈ మేరకు విద్యాసంస్థలకు సెలవులు ప్రకటిస్తూ విద్యాశాఖ ఉన్నతాధికారులు శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారని హనుమకొండ డీఈఓ ఎండి అబ్దుల్‌హై తెలిపారు. గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ఈనెల 20, 21న కూడా సెలవులు ఇచ్చిన విషయం విదితమే. 23 ఆదివారం 24న విద్యాసంస్థలు తెరుచుకుంటాయి.

ఆమడ దూరంలో ఎయిడ్స్ నిర్ధారణ పరీక్షలు



వరంగల్ కేఎంసీ మెటర్నిటీ ఆస్పత్రిలోని ఐసీటీసీ కేంద్రం



మాట్లాడుతున్న ఐసీటీసీ కేంద్రం నిర్వాహకులు

- కీలకమైన వరంగల్ కేఎంసీ సెంటర్ ఎత్తివేత..?

సాక్షిప్రతినిధి, వరంగల్: హేతుబద్ధీకరణ (రేషనలైజేషన్) పేరుతో ఎయిడ్స్ వ్యాధి నిర్ధారణ పరీక్ష, కౌన్సెలింగ్ (ఐసీటీసీ) కేంద్రాలను కుదించేందుకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది కేంద్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలోని జాతీయ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ (న్యాకో) ఈ మేరకు చర్యలు చేపట్టినట్లు సమాచారం. ఈ మేరకు జూలై 5న న్యాకో జారీ చేసిన సర్క్యులర్ నంబర్ 11025 పట్ల ఆ సంస్థ సిబ్బంది ఆందోళనలో పడ్డారు. ఎయిడ్స్ రోగులు సైతం అయోమయానికి గురవుతున్నారు.

ఐసీటీసీ కేంద్రాన్ని ఎత్తేయడం సమంజసం కాదు

ఎంజీఎం : పేద గర్భిణీలకు ఉత్తమ సేవలందిస్తున్న వరంగల్ సీకేఎం ఆస్పత్రి ఐసీటీసీ కేంద్రం ఎత్తివేయడం సమంజసం కాదని ఐసీటీసీ కేంద్ర నిర్వాహకులు పేర్కొన్నారు. శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ తల్లి నుంచి బిడ్డకు హెచ్ఐవీ సోకకుండా ప్రప్రథమంగా 2002 నాకో సీకేఎం ఆస్పత్రిలో ఎస్‌ఏసీఎస్ ఆధ్వర్యంలో ఐసీటీసీ కేంద్రాన్ని నెలకొల్పారు. ఈ కేంద్రం ద్వారా ఆస్పత్రిలో 3 వేల పరీక్షలు చేయడంతో పాటు 8 హెచ్ఐవీ పాజిటివ్ ఉన్న ప్రసవాలు చేసి తల్లి నుంచి బిడ్డకు వ్యాధి సోకకుండా చికిత్సలు అందిస్తున్నామని తెలిపారు. గత 21 ఏళ్లుగా వివిధ జిల్లాలు, ఇతర రాష్ట్రాలకు చెందిన ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులలో చికిత్సలు అందించినట్లు తెలిపారు. కేంద్రం ప్రారంభమైన నాటి నుంచి 3,52,766 పరీక్షలు నిర్వహించి 1347 పాజిటివ్‌లు రాగా ఇందులో 1089 డెలివరీలు చేసినట్లు తెలిపారు. అలాగే పిల్లలకు 18 నెలల వరకు ఫాలో ఆప్ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కేంద్రంలో పనిచేస్తున్న నలుగురు కౌన్సిలర్లు, ఇద్దరు ల్యాబ్ టెక్నీషియన్లు పని చేస్తున్నారని, రాష్ట్రంలో రెండుసార్లు ఉత్తమ అవార్డులు తీసుకున్నారని తెలిపారు.

ఉమ్మడి జిల్లాలో ఎత్తివేసే కేంద్రాలు ఇవే ...

వరంగల్ కాకతీయ మెడికల్ కాలేజ్ (కేఎంసీ) ఆవరణలోని ఎయిడ్స్ వ్యాధి నిర్ధారణ పరీక్ష, కౌన్సెలింగ్ (ఐసీటీసీ), జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో గల రెండు సామాజిక ఆరోగ్య కేంద్రాల్లోని రెండు ఐసీటీసీ కేంద్రాలు మహాదేవపూర్, చిట్యాల. మహబూబాబాద్ జిల్లాలో గూడూరు, వరంగల్ జిల్లాలో సీకేఎం మెటర్నిటీ హాస్పిటల్‌లలో గల ఐసీటీసీ కేంద్రాల ఎత్తివేతకు రంగం సిద్ధం కావడంపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది.

నేడు కేఎంసీలో 'రీసెర్చ్' డే

- హాజరుకానున్న మంత్రి హరీశ్‌రావు



బుక్ ఆవిష్కరిస్తున్న ఎన్ఆర్ఐ అసోసియేషన్ బాధ్యులు

ఎంజీఎం: మెడిసిన్ విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించేందుకు శనివారం కేఎంసీలోని ఎన్ఆర్ఐ బిల్డింగ్‌లో విద్యార్థులకు 'రీసెర్చ్ డే' నిర్వహించనున్నట్లు ఎన్ఆర్ఐ అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ సుజిత్ తెలిపారు. శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మెడిసిన్ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థుల్లో సృజనాత్మకత తగ్గిందని గ్రహించి, వాటిని పెంపొందించేందుకు ఈ రీసెర్చ్ డే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమాన్ని శనివారం రాష్ట్ర మంత్రి హరీశ్‌రావు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించనున్నట్లు సుజిత్ పేర్కొన్నారు. మొదటి దశలో ఇక్కడ నిర్వహించిన ఫలితాలను బట్టి దీన్ని మొత్తం భారతదేశం మొత్తం అమలు చేయనున్నట్లు తెలిపారు. దీనికి కావాల్సిన వనరులను మొత్తం ఎన్ఆర్ఐ అసోసియేషన్ భరిస్తుందని తెలిపారు. రీసెర్చ్ డేలో భాగంగా ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు మెడిసిన్ విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. అనంతరం రీసెర్చ్ డేకు సంబంధించిన పుస్తకాలను వారు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎన్ఆర్ఐ అసోసియేషన్ సెక్రెటరీ డాక్టర్ అనుపమ, వైస్ ప్రెసిడెంట్‌లు డాక్టర్ వేణు, డాక్టర్ సుబ్రమణ్యేశ్వర్‌రావు, డాక్టర్ వి.లక్ష్మి నరసింహారావు, డాక్టర్ మోహన్‌దాస్, రోహిత్, సాయికిరణ్, విద్యార్థులు పాల్గొన్నారు.

నకిలీ మావోయిస్టుల అరెస్ట్

వెంకటాపురం(కె): మావోయిస్టుల పేరుతో డబ్బులు వసూలు చేస్తున్న ముగ్గురు నకిలీ మావోయిస్టులను శుక్రవారం పోలీసులు అరెస్టు చేశారు. సీఐ శివప్రసాద్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శుక్రవారం మావోయిస్టు ఏరియా కార్యదర్శి సుధాకర్ పేరుతో ఇసుక కాంట్రాక్టర్ల వద్ద నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారనే పక్కా సమాచారం మేరకు ఎస్సై తిరుపతిరావు, సిబ్బందితో కలిసి వెంకటాపురం గ్రామ శివారులో వాహన తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామ శివారులో ముగ్గురు వ్యక్తులు బ్యాగ్‌తో అనుమానాస్పదంగా కనిపించి పోలీసులను చూసి పారిపోతుండగా పోలీసులు వారిని వెంబడించి పట్టుకున్నట్లు తెలిపారు. వారి నుంచి రూ. 10 వేల నగదు, రెండు బొమ్మ తుపాకులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పట్టుకున్న ముగ్గురిని విచారించగా మంగవాయి గ్రామానికి చెందిన తాటి సురేష్, మంగులు చత్తీష్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా జారువ గ్రామం, గోట రాజస్తాన్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా కాండే గ్రామానికి చెందిన వారుగా తెలిపారు. ముగ్గురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపించినట్లు సీఐ తెలిపారు.



అరెస్ట్ చూపుతున్న పోలీసులు

ఐ ఫోన్ గెలుచుకున్నావు..

- సైబర్ నేరగాళ్ల ఉచ్చులో యువకుడు
- బ్యాంకు ఖాతాలో రూ.29 వేలు మాయం

ఖిలా వరంగల్: ఐ ఫోన్ గెలుచుకున్నావంటూ మొబైల్‌కు మెసేజ్..కాల్ రాగా దీనిపై ఓ యువకుడు స్పందించి సైబర్ నేరగాళ్ల ఉచ్చులో చిక్కి రూ.29వేలు పోగొట్టుకున్న ఘటన శుక్రవారం సాయంత్రం ఖిలావరంగల్‌లో వెలుగుచూసింది. బాధితుడి కథనం ప్రకారం మధ్యకోటకు చెందిన హైమద్ అలీ మొబైల్‌కు శుక్రవారం సైబర్‌నేరగాడు 7837905596 నంబర్‌ను నుంచి మేసేజ్.. ఆ తర్వాత కాల్ వచ్చింది. తనయుడి చేతిలో ఉన్న తండ్రి మొబైల్‌కు వచ్చిన మేసేజ్‌పై వెంటనే యువకుడు స్పందించాడు. మీకు ఐ పాడ్ మొబైల్ గెలుచుకున్నావంటూ మీ మొబైల్‌కు వచ్చిన ఓటీపీ చెప్పాలని సైబర్ నేరగాడు కాల్ చేసి అడిగాడు. ఆ యువకుడు ఆనందంతో ఓటీపీ చెప్పాడు. క్షణాల్లోనే తండ్రి బ్యాంకు ఖాతా నుంచి రూ.29 వేల నగదు మాయమైనట్లు మెసేజ్ వచ్చింది. సైబర్ నేరగాళ్ల ఉచ్చులో చిక్కానని బ్యాంకు ఖాతాను బ్లాక్ చేసుకున్నాడు. శుక్రవారం సాయంత్రం మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు హైమద్ అలీ తెలిపారు.

సీపీఎస్‌ను రద్దు చేయాల్సిందే

- టీఎస్‌సీపీఎస్ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు స్థితప్రజ్ఞ

కాశిబుగ్గ : సీపీఎస్‌ను రద్దు చేసి పాతపెన్షన్ విధానం అమలు చేసే వరకు పోరాటం ఆగదని తెలంగాణ స్టేట్ కంట్రిబ్యూషన్ పెన్షన్ స్కీం ఎంప్లాయీస్ యూనియన్ (టీఎస్‌సీపీఎస్ఈయూ) రాష్ట్ర అధ్యక్షుడు గంగాపురం స్థితప్రజ్ఞ అన్నారు. సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్ పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ టీఎస్‌సీపీఎస్ఈయూ ఆధ్వర్యంలో ఆలంపూర్ జోగులాంబ దేవాలయం నుంచి చేపట్టిన సంకల్ప రథయాత్ర శుక్రవారం సాయంత్రం వరంగల్‌కు చేరుకుంది. ఓ సిటీ మైదానం వద్ద ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా స్థితప్రజ్ఞ మాట్లాడుతూ 2004 నుంచి ఆమల్లోకి వచ్చిన సీపీఎస్ విధానంతో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాత పెన్షన్ విధానం సాధించడమే ఈ సంకల్ప రథయాత్ర లక్ష్యమన్నారు. అనంతరం ఉద్యోగులు రథయాత్రతో పాటు బైక్ యాత్ర వెంకట్రామ జంక్షన్, కాశిబుగ్గ, పోచమ్మమైదాన్, ఎంజీఎం, ములుగు రోడ్డు మీదుగా హనుమకొండ కీర్తిస్తూపం వరకు బైక్ ర్యాలీ సాగింది. ఈ యాత్రలో జిల్లా అధ్యక్షుడు కందుల జీవన్, వివిద శాఖల సీపీఎస్ ఉద్యోగులు పాల్గొన్నారు.



ఓ సిటీ మైదానంలో స్థితప్రజ్ఞకు స్వాగతం పలుకుతున్న ఉద్యోగులు

విద్యుదాఘాతంతో యువరైతు మృతి



భూక్య రమేష్ (ఫైల్)

మహబూబాబాద్ రూరల్ : విద్యుదాఘాతంతో యువరైతు మృతి చెందిన సంఘటన మహబూబాబాద్ మండలంలోని దర్గతండ గ్రామపంచాయతీ పరిధిలోని టేకులగూడెంలో చోటుచేసుకుంది. రూరల్ ఎస్సై బీ.రాంచరణ్ తెలిపిన వివరాల ప్రకారం.. టేకులగూడెంకు చెందిన రైతు భూక్య రమేష్ (35) తన వ్యవసాయ భూమి వద్ద ఉన్న బావి వద్దకు వెళ్లాడు. బావికి సంబంధించిన స్టార్టర్ బోర్డు పాకాల వాగు వరద ఉధృతి పెరగడంతో అందులో పడి తడిసిపోతుందని ఆందోళనతో అక్కడి నుంచి తొలగించే ప్రయత్నం చేస్తుండగా విద్యుత్ వైర్లు తగిలి షాక్‌కు గురయ్యాడు. స్థానిక రైతులు గమనించి చికిత్స నిమిత్తం మహబూబాబాద్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడే చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య కల్యాణి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

వలలో చిక్కి మత్స్యకారుడు..

దేవరుప్పుల : నాలుగు దశాబ్దాలుగా కులవృత్తిని న మ్ముకొని జీవిస్తున్న మత్స్యకారుడు ఆసరా ఇచ్చిన చేపల వలలోనే చిక్కి మృత్యువాత పడిన సంఘటన శుక్రవారం మాదాపురంలో చోటుచేసుకుంది. మండలంలోని మాదాపురంలో ముదిరాజ్ కులానికి చెందిన బొందుగుల నాగయ్య (55) గ్రామసమీపంలోని గరికచెరువు మత్తడి పోయడంతో చేపలు పట్టేందుకు వలతో వెళ్లాడు. చేపల కోసం వల విసిరిన అతను తీసేందుకు యత్నించే క్రమంలో ఈత వచ్చినప్పటికీ వలలో చిక్కుకొని లోతుగా ఉన్న నీళ్లలో పడి నీటమునిగాడు. సమీపంలో పశువులను కాస్తున్న నాగయ్య మేనల్లుడు శివతేజ గమనించి కుటుంబ సభ్యులు, గ్రామస్తులకు సమాచారం అందించారు. నీటమునిగిన నాగయ్యను బయట తీసి పరిశీలించగా మృతి చెంది ఉన్నాడు. మృతుడికి భార్య, ముగ్గురు కూతుర్లు, కొడుకు ఉన్నారు. సంఘటనస్థలానికి హెడ్‌కానిస్టేబుల్ సీహెచ్.శ్రీనివాస్ చేరుకొని భార్య ఉప్పమ్మ ఫిర్యాదు మేరకు శవపంచనామా చేసి పోస్టుమార్టం నిమిత్తం జనగామ ఏరియా ఆసుపత్రికి తరలించారు.



నాగయ్య మృతదేహం

28 కిలోల ఎండు గంజాయి స్వాధీనం



నిందితుల అరెస్ట్ చూపుతున్న ఏసీపీ దేవిడ్‌రాజ్

కాజీపేట: ఎండు గంజాయిని అక్రమంగా రవాణా చేస్తున్న ఇద్దరు యువకులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు ఏసీపీ డేవిడ్‌రాజ్ తెలిపారు. శుక్రవారం రాత్రి కాజీపేట పోలీస్‌స్టేషన్‌లో సీఐ సార్ల రాజుతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సై బండారి రాజు పెట్రోలింగ్ చేస్తుండగా ఇద్దరు యువకులను అనుమానాస్పదంగా నాలుగు బ్యాగులతో కనిపించగా తనిఖీ చేసినట్లు తెలిపారు. ఆ బ్యాగుల్లో 28 కిలోల శుద్ధి చేసిన ఎండు గంజాయి లభించిందన్నారు. మహారాష్ట్రలోని జల్నా జిల్లాకు చెందిన ఫిరోజ్ అహ్మద్ పటేల్, షేక్ షఫీక్, షేక్ గయాస్‌లను అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. గంజాయి విలువ దాదాపు రూ.5.60 లక్షలు ఉంటుందన్నారు. సమావేశంలో ఎస్సైలు బండి రాజు, ప్రమోద్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

కేయూ పరిధిలోని నేటి పరీక్షలు వాయిదా

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం, అదిలాబాద్ జిల్లాలో ఈనెల 22న నిర్వహించాల్సిన పలు పరీక్షలను వాయిదా వేసినట్లు పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ రాధిక తెలిపారు. బీఫార్మసీ 8వ సెమిస్టర్, ఫార్మాడి నాల్గవ సెమిస్టర్, బీటెక్ ఫస్టియర్ అలాగే బీఫార్మసీ నాన్ సీబీసీఎస్ నాల్గవ, మొదటి సెమిస్టర్ పరీక్షలు వాయిదా వేశామని తెలిపారు. ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండటంతో వాయిదా వేసినట్లు తెలిపారు. ఇప్పటికే ఈనెల 20, 21 తేదీల్లో జరగాల్సిన పరీక్షలు కూడా వాయిదా పడిన విషయం విదితమే. వాయిదా పడిన పరీక్షల రీషెడ్యూల్‌ను శనివారం విడుదల చేస్తామని వారు తెలిపారు.

పెండింగ్ కేసుల్లో చార్జ్‌షీట్ దాఖలు చేసిన సీఐడీ

వరంగల్ లీగల్: చాలా కాలంగా విచారణలో ఉన్న పలు కేసుల్లో వరంగల్ రీజనల్ సీఐడీ పోలీసులు శుక్రవారం కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. 2010 ఖమ్మం జిల్లా కేంద్రంలోని టూ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో నమోదైన లజ్జ కేసుగా పేరు గాంచిన ఈ కేసును మతవైషమ్యాలు రెచ్చగొట్టే విధంగా..దురుద్దేశ పూరిత వ్యాఖ్యలతో కూడిన రెండు వ్యాల్యుమ్స్‌తో కూడిన బుక్స్ ముద్రించిన నేరంపై ఆరుగురు నిందితులపై కేసు నమోదు చేశారు. మహ్మద్ ప్రవక్త, ముస్లిం పవిత్ర గ్రంథమైన ఖురాన్‌పై వివాదపరమైన వ్యాఖ్యలు రాసిన దానిపై నిషేధిత సల్మాన్ ఖుర్షిద్ రాసిన సటానిక్ వర్సెస్, తస్లీమా నస్రీన్ రాసిన లజ్జ పుస్తకం ..నిషేధించిన పుస్తకాల నుంచి రాసిన కథనాలపై కేసు నమోదు చేశారు. అలాగే భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మన్నపేట పోలీస్‌స్టేషన్‌లో 2016లో నమోదైన కేసులో కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ కోసం ఓ వ్యక్తిని కిడ్నాప్ చేసి శ్రీలంకలోని కొలంబోకు తీసుకెళ్లి రూ.5 లక్షలకు కిడ్నీ మార్పిడి చేశారు. అంతర్జాతీయ కిడ్నీ రాకెట్ కేసులో శ్రీలంకతో పాటు ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన 10 మందిపై కేసు నమోదు చేశారు. అలాగే సింగరేణి మేనేజ్‌మెంట్ ట్రైనింగ్ పరీక్షల్లో మోసపూరితంగా కుట్ర చేసి ఓ వ్యక్తి బదులు మరో వ్యక్తితో పరీక్ష రాయించిన కుట్రలో సుంచుపెల్లి పోలీస్‌స్టేషన్‌లో 9 మందిపై కేసు నమోదు చేశారు. అలాగే స్టేట్‌బ్యాంకు ఆఫ్ హైదరాబాద్ కేసముద్రం బ్రాంచిలో ముద్ర లోన్‌గా పేరుగాంచిన కేసులో 9 మంది నిందితులపై సీఐడీ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో బ్యాంకు మేనేజర్, ఫీల్డ్ ఆఫీసర్ లబ్ధిదారులతో కుమ్మక్కై, తప్పుడు పత్రాలు సృష్టించి సంతకాలు ఫోర్జరీ చేసి ఒక్కొక్కరిపై రూ.6 లక్షలు మొత్తం రూ.54 లక్షలు లోన్ మంజూరు చేశారు. దీనిపై ఇరువురు బ్యాంకు అధికారులు, తొమ్మిది మంది లబ్ధిదారులపై కేసు నమోదు చేశారు. ఆయా కేసుల్లో విచారణ చేపట్టి శుక్రవారం వరంగల్ సీఐడీ అధికారులు చార్జ్‌షీట్ దాఖలు చేశారు.

2012 బ్యాచ్ ఎస్సైలకు పదోన్నతి

వరంగల్ క్రైం: రాష్ట్రంలో 2012 బ్యాచ్ సబ్ ఇన్‌స్పెక్టర్లకు రాష్ట్ర ప్రభుత్వం ఇన్‌స్పెక్టర్లుగా పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పనిచేస్తున్న పలువురికి పదోన్నతి లభించింది. పదోన్నతి పొందిన వారిలో భూక్య శంకర్, కొత్తపల్లి అశోక్ కుమార్, పెండ్యాల దేవేందర్, సీహెచ్.కరుణాకర్‌రావు (ములుగు), నందునూరి చంద్రమోహన్ ఉన్నారు. పదోన్నతి పొందిన అధికారులను పలువురు పోలీస్ అధికారులు అభినందించారు.